# ఇద్దరు హాస్యనటులు

ఒక పట్టణంలో ఇద్దరు హాస్యనటులు ఉండేవారు. నాటకాలు చూసేవారికి వారిద్దరూ రెండు కండ్లవంటి వారు. ఒకరికి తీసిపోని నైపుణ్యం మరొకరిది హాస్యంలో. గోపాలరావు రంగస్థలంమీదికి వచ్చి నోరు తెరవగానే ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వేవారు. అంతటి హాస్యగాడతను. రమణమూర్తి మాట్లాడకుండా రంగంమీద కాసేపు నిలబడితే చాలు, చూస్తున్న వాళ్ళ నవ్వుకు అంతుండేది కాదు. అతని నైపుణ్యం అటువంటిది. నిజానికి ఆ ఇద్దరిలో ఎవరిది పైచేయి అన్న విషయం పెద్ద పెద్ద కళాకారులకి, న్యాయాధిపతులకు, మహామహులకు కూడ కొరుకుడుపడలేదు. విక్రమాదిత్యునివంటి వారెవరయినా తేల్చవలసిందే కాని సామాన్యుల వలన కాదని చాలామంది అభిప్రాయం.

వృత్తిలో వారిద్దరికీ అంతటి పోటీ ఉన్నా వాళ్ళు ఆప్తమిత్రులు. ఒకరి కష్టసుఖాలు మరొకరివి. వాళ్ల స్నేహాన్ని పరీక్ష చేసేందుకన్నట్టు వాళ్ళకు ఒక సమస్య ఎదురయింది. ఆ సమస్య పేరు రాధ.

రాధ ఆ ఊళ్ళోనే ఒక గొప్ప నర్తకి. ఆమె పేరు వాడవాడలా మ్రోగింది. ఆమె అందం జగత్ప్రసిద్ధం. రాధతో పరిచయభాగ్యం పొందాలని చాలామంది తహతహలాడేవారు. కాని ఆమె వారికి అందనిపండయింది. రాధతో బాగా పరిచయమున్న వాళ్లు ఇద్దరు. గోపాలరావు, రమణమూర్తి. ఎప్పటికయినా వారిద్దరిలో ఒకరిని ఆమె వివాహమాడుతుందని చాలామంది ఉద్దేశం, నమ్మకమూను. నిజం కూడ అంతే. ఆమె వారిద్దరినీ మనసారా ప్రేమించింది. ఆమెకోసం ఏ త్యాగం చేసేందుకయినా వారిద్దరూ సిద్ధమే. రాధ కూడ వారిని సమానమయిన ప్రేమతో చూస్తుంది. గోపాలరావు అందం ఆమెని ఆకర్షించింది. రమణమూర్తి నాజూకుతనం ఆమెని వశం చేసుకున్నది. రాధకు వారిద్దరూ ప్రాణసమానులు. వారికి రాధే ప్రాణం.

తమ ఇద్దరిలో ఎవరిని రాధ వరిస్తుందో వారికి తెలియదు. ఆ ఇద్దరిలో ఎవరిని ఎన్నుకోవాలో ఆమెకు తోచలేదు. ఒకనాడు ఆ విషయమే వారికి చెప్పింది.

"ఇదీ సమస్య" అంది.

ఇద్దరూ నిట్టూర్చారు.

"మీలో ఎవరు గొప్ప హాస్యం చేయగలరో వారిదాన" నంది తల వంచుకుని.

"ఆ విషయం తేల్చేదెవరు? ఇద్దరూ గొణిగారు.

"అదే సమస్య!" అంది.

ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు మౌనంగా, బాధతో. చివరికి రాధ "నాకొక ఉపాయం తోస్తోంది" అంది.

"ఏమిటి?"

"సంక్రాంతికి రాజధానిలో నాటక ప్రదర్శనాలవుతాయి కదూ?" అంది.

"అవు"నన్నారు.

"మీలో అధికులెవ్వరో అక్కడే తేల్చుకుందాం".

ఇద్దరూ నిరాశ పొందారు "తేల్చేదెవరు?"

## సింగరాజు రామచంద్రమూర్తి

"అవును తేల్చేదెవరు?"......

"ప్రజలు! ప్రజల నిర్ణయాన్ని మనం తీసుకుందాం. అది ఫైనల్ దాని ప్రకారం చేద్దాం" అంది రాధ తృప్తిగా.

సరేనని బయటికి వచ్చేశారు.

అప్పుడు గాని వాళ్ళకి అసలు విషయం తట్టలేదు. వెంటనే దగ్గరలో ఒక పెద్ద హోటలుకి వెళ్లి కూలబడ్డారు.

"ఇన్ని రోజులుగా తేలని సమస్య ఆ నాడు తేలుతుందని నమ్మకమేమిటి?" అన్నాడు గోపాలరావు.

"అవును నమ్మకమేమిటి?"

"పోనీ హాస్యంగాక ఇంకో పాత్ర వేసి అందులో మనం పోటీపడితే! ప్రతిపాదించాడు మూర్తి.

గోపాలరావు కిది నచ్చలేదు.

"లాభం లే"దన్నారు ఇద్దరూ ఒకేసారి.

వీళ్ళిట్లా తలపట్లు పడుతూంటే ఆ చుట్టుప్రక్కల నున్న వాళ్ళు "వాళ్ళే ప్రఖ్యాత హాస్యగాళ్లు" అనుకుంటూ ఒకళ్లకొకళ్లు చూపించుకుంటున్నారు. ఇంతలో

"క్షమించండి. నాకో చిన్న సాయం చేయగలరా" అన్నాడు శుభ్రమైన బట్టలు వేసుకుని ఎదురుగా నిలబడిన ఒక ఆసామీ.

ఆయన్ని పరిశీలనగా చూశారిద్దరూ. ముప్పయిఅయిదు ప్రాంతాల ఉంటాడు.

"మా సమస్య తేలక మేము ఇదవుతుంటే మీకు సాయమేం చేయగలం?"

"చేయగలరు. చిన్న సాయం. నేను రేపొక సభలో మాట్లాడవలసి ఉంది. అసలే నాకు సభాకంపం. దాన్ని వదిలించుకోవటం ఎలా అని ఆలోచిస్తున్నాను."

"'అనివార్య కారణాల వలన రాలేకపోయినందుకు క్షమింప ప్రార్థన' అని ఉత్తరం రాసిపారేయండి." రమణమూర్తి సూచించాడు.

"అలా వీల్లేదే! నేను మాట్లాడితీరాలి."

"సరే అయితే. దేనిగురించి మీరు మాట్లాడాలి" అడిగాడు గోపాలరావు.

"నా స్వానుభవాలు. నేను సెంట్రల్ జైలులో పనిచేసి రిటైరయాను. నా కళ్ళముందుగా బోలెడుమంది ఉరితీయబడ్డారు. నాకా జీవితంమీద విరక్తిపుట్టింది. అసహ్యం వేస్తోంది. ఇప్పుడా సభ [illegible] అంతా 'క్యాపిటల్ పనిష్మెంటు' మీద ప్రజలలో ఏవగింపు కలిగించేందుకు ఏర్పాటయింది. అందువలన నావంటివాడి అనుభవాలు చెప్పటం చాలా అవసరం," అన్నారు ఆసామీగారు.

గోపాలరావుకి హఠాత్తుగా తలలో మెరుపు మెరిసింది. దాని తాలూకు కాంతి ముఖంమీద ప్రసరించింది.

"మిమ్మల్ని ఆవూళ్ళో ఎవరన్నా ఎరుగున్నారా?" అడిగాడు.

"వ్యక్తిగతంగా నన్నెవరూ ఎరగరు. కానీ నా పేరు విన్నారు."

గోపాలరావు ఆనందానికి అంతులేదు.

"అయితే ఒక్క విషయం. మీ కెంత కావాలంటే అంత ఇస్తాను. నేనా సభలో మాట్లాడేందుకు మీరొప్పుకుంటే" అన్నాడు. ఆయన కర్థంకాలేదు.

"నేను మీకు బదులు, మీ పేరుతో వెళ్ళి అక్కడ మాట్లాడతాను. మిమ్మల్ని ఎవరూ ఎరగరు కాబట్టి అనుమానించరు. అసలు విషయం తరువాత వెల్లడైతే 'హాస్యచక్రవర్తి గోపాలరావు ఎంతటి యుక్తిపన్నాడు!' అని విస్తుపోతారు, సరేనా" అన్నాడు హుషారుగా.

# ★ ఇద్దరు హాస్యనటులు ★

రమణమూర్తికి కాళ్ళు చేతులు చల్లబడ్డాయి.

"సరే, అలాగే" అనిచెప్పి వెళ్ళిపోయాడు ఆసామీ.

ఇదేగనక సవ్యంగా జరిగిపోతే తనముఖం ఎవరుచూస్తారు? గోపాలరావు ఘనవిజయం సాధించినట్లే. రాధ అతనిదయిపోతుంది. తనకి మిగిలేది చీకటి అని రమణమూర్తిచాలా బాధపడ్డాడు కాని చేయగలిందేముంది?

తను చేయబోతున్న పనిని రాధకి వివరించి చెప్పాడు రావు. రమణమూర్తిని, రాధని ఆ సభకి వచ్చి తన విజయాన్ని కళ్ళారాచూసి ఆనందించమన్నాడు. ఇద్దరూ సరే నన్నారు.

తనకి రాబోయే విజయం, పట్టబోయే అదృష్టం, కాబోయే భార్య అతన్ని ఆనంద సాగరంలో తేల్చినట్టు గోపాలరావు భావించాడు.

*　　　*　　　*

తన ముఖం అందరికి సుపరిచితం కాబట్టి కావలసిన విధంగా మారువేషం వేసుకుని చేరుకున్నాడా ప్రముఖ గోపాలరావు. ఘనంగా ఆహ్వానించ బడ్డాడు.

రాత్రి బహిరంగ సభ. కరతాళ ధ్వనుల మధ్య వేదిక నెక్కాడు. అధ్యక్షుడు ఉపన్యాసకుడిని పరిచయం చేస్తూ "జైళ్ళలో చాలా అనుభవం కలవారు. వారి చేతి మీదుగా చాలా మంది ఉరికంబానికి పంపించబడి నందుకు ఆయన పడుతున్న బాధ ఇంతింతకాదు" అన్నారు.

తరువాత గోపాలరావు మొదలు పెట్టాడు.


## అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్ - 2.
(దక్కన్)






## నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము, బిక్షాళ, నిస్సత్తువ వగైరా హరించి. బలము రక్తవృద్ధి కల్గించును. 20 తు. డబ్బీ రు. 3-4-0. పోస్టేజి రు. 1-1-0.

పి. సి. ఏ. అండ్ కంపెనీ, (ఆయుర్వేద సమాజం
పెరిదేపి (పోస్టు) — నెల్లూరుజిల్లా.


తన బాల్యం, తిరిగిరాని చిన్నతనపు రోజులలోని ఆనందం వగైరా ఏకరువు పెడుతున్నాడు.

"గోపాల్ తన మామూలు ధోరణిలో హాస్యం మొదలుపెట్టాడు. చూడు అంతా ఎంత ఆనందంగా ఉన్నారో!" అంది రాధ రమణమూర్తితో.

"పొరపాటు. క్రమేణా అసలు విషయంలోకి వస్తాడు చూస్తుండు."

అతనన్నట్టే అయింది. అసలు విషయంలోకి వచ్చాడు ఉపన్యాసకుడు. హాస్యరేఖలు ఆవరించుకొన్న అతని ముఖంలో విచారం పొడిగట్టింది. అతనితో పాటు శ్రోతలు కూడ మారుతున్నారు. తన చేతి మీదుగా బలిఅయిన ఒక్కొక్కరిని, వారప్పుడెలా ప్రవర్తించిందీ మొదలయిన వన్నీ ఏకరువు పెట్టాడు. సూది పడితే వినబడేంత నిశ్శబ్దంగా ఉంది సభాస్థలం. ఏ క్షణంలో నయినా కళ్ళనుంచి ప్రవాహాలు ఉరకవచ్చు నన్నట్లున్న ముఖాలతో వింటున్నారు. శిలా ప్రతిమల్లా కూర్చున్నారు సభికులు.

చివరి కతనిఉపన్యాసం ముగిసింది. భారమైన అడుగులతో వేదిక దిగాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. చప్పట్లు కొట్టలేదు. రాళ్ళకి మల్లే కదలకుండా ఉన్నారు. గోపాలరావుకి కావలసింది కూడ అదే. తన ఉపన్యాసానంతరం కరతాళ ధ్వనులు చేశారంటే తనశ్రమ అంత వృధాఅని అతని ఉద్దేశం.

విజయోత్సాహంతో రాధ దగ్గిరికి చేరుకున్నాడు. "చాలా గంభీరోపన్యాసం ఇచ్చావు గోపాల్! అందరినీ శోకసముద్రంలో ముంచావు," అంది రాధ అభినందిస్తూ. ఆమెకండ్లలోని మెరుపు గోపాలరావుని సంతృప్తి పరిచింది.

"నిన్నెవరూ గుర్తుపట్టలేదు. బాగా నటించావు" అన్నాడు రమణమూర్తి నిర్లిప్తంగా.

గోపాలరావు చుట్టు జనం మూగయారు. అభినందించని వారు లేరు. ఇంతలో ఒకతను వచ్చి అతని చేతిలో ఒక అందమయిన కవరు పెట్టాడు. "మా వెంకటేశ్వరపురం జమీందారుగారు మీకియ్యమన్నారు" అన్నాడు సవినయంగా.

గోపాలరావు కొగితం తీసి చూశాడు. ఆ నాటిరాత్రి తనతో విందారగించేందుకు తన భవనానికి రావలసినదిగా మరీ మరీ కోరారు అందులో.

"వస్తానని చెప్పు వారితో" అని వాడిని పంపేసి రాధవైపు తిరిగి ఆ విషయం చెప్పి తను రాత్రికి విందుకు వెడుతున్నానని కూడ చెప్పాడు.

"వెంకటేశ్వరపురం జమీ పేరింతవరకు వినలేదు." రమణమూర్తి గొణిగాడు.

"రాత్రికి మిమ్మల్ని కలుసుకుంటాను" అని చెప్పి విందుకు తయారయేందుకు వెళ్ళిపోయాడు.

ఆహ్వానలేఖలోని గుర్తులప్రకారం అక్కడికి చేరుకున్నాడు గోపాలం. అతని ఆశ్చర్యాని కంతులేదు. అక్కడ ఒక చిన్న సైజు కోట, లేక భారీ ఎత్తున మేడ ఉంటాయని ఊహించిన అతనికి అక్కడ వున్న చిన్న డాబా చాలా ఆశాభంగం కలిగించింది. "ప్రస్తుతాని కిందులో ఉంటున్నారు కాబోలు"నని సరిపెట్టుకుని ఇంటి దగ్గరికి వెళ్లాడు. ఒక నౌకరు అతన్ని ఆహ్వానించి ఒక హాలులో కూర్చోపెట్టాడు.

"అయ్యగారు పది నిముషాలలో వస్తారు. మరో విధంగా అనుకోకుండా మిమ్మల్ని కూర్చోమన్నారు" అన్నాడు.

గోపాలం చాలా నిరుత్సాహపడ్డాడు—హాయిగా, ఆనందంగా రాధతో భోజనం చేయక కోరి ఈ తద్దినం తెచ్చుకున్నానని బాధపడ్డాడు. పావుగంట గడిచాక వంగిపోయిన ఒక ముసలాయన కర్ర పుచ్చుకుని, మెల్లిగా అడుగు వేసుకుంటూ ప్రవేశించాడు. గోపాలం లేచి నిలబడ్డాడు మర్యాదగా.

"కూర్చోండి. కొంచెం ఆలస్యమైంది" అని తానుకూడ ఒక సోఫాలో కూలబడి "మీరు నా కోరికప్రకారం ఇక్కడికి రావడం చాలా ఆనందం. ఇందాక మీ ఉపన్యాసం విన్నాను. చాలా గొప్పగా వుంది. వెంకటయ్యా, భోజనాలు పట్టుకురా." అని కేకేశాడు.

గోపాలరావుని ఆ యిల్లూ, ఆయన పరిస్థితీ చాలా క్రుంగదీశాయి.

ఆ పరిస్థితిలో భోజనం మాట వినేప్పటికి నిజాని కతనికి కొంతహుషారు కలిగింది. జమీందారు లేదెలాగున్నా భోజనం మట్టుకు బాగా చేస్తారని అతని విశ్వాసం... కానీ వడ్డించిన ఆధరువులు చూడగానే అతనికి నోటమాట రాలేదు.

ఎలాగో భోజనం అయిందనిపించారు.

"మీరు ఇందాక చెప్పినవన్నీ నిజమేనా?" అడిగాడు ముసలాయన.

"అక్షరాలా"

"అయితే మీరు వెంకటపతిని గురించి చెప్పినది కూడా నిజమేనా?"

"పూర్తిగా."

కాసేపాయన ఏమీ మాటాడలేదు. ఇంతలో రెండు గ్లాసులనిండా, ద్రాక్షరసం పట్టుకొచ్చి బల్లమీద పెట్టాడు ప్యూన్.

"ముందు అది కానివ్వండి. తరువాత మాట్లాడుకుందాం" అని తనొకటి తీసుకొని గోపాలంకి ఒకటందించాడు. ఇద్దరూ తాగేశారు.

"ఉరితీసేందుకు తీసుకువెడుతుంటే మంచి ధైర్యంగా ఉన్నాడా, లేకపోతే విచారం కనబరిచాడా?"

"ఎవరు?"

"అదే వెంకటపతి"

"అతనా, చాలా ధైర్యంగా ఉన్నాడు"

"ఠీవిగా నడిచాడా?"

"ఆహా! హుందాగా"

చివరిదాకా అలాగే ఉన్నాడా?"

గోపాలానికి ఈ ప్రశ్నలు అర్థం కాలేదు. "చివరిదాకా కూడా" అన్నాడు విసుగా.

"నీ చేతులతో నే వాడిని చంపించావు కదూ" సూటిగా అడిగాడు.

గోపాలం ఉలిక్కిపడ్డాడు...సర్దుకుని "న్యాయం చేతులో ఆయుధాన్ని మట్టుకు నేను. ఆయుధాలకి ఆలోచించే శక్తి ఉండకూడదు" అన్నాడు తన మాటలకి తనే ఇదవుతూ.

కటిక గుండెనీది. ఎలా చంప బుద్ధేసింది.? రాక్షసుడా!" అరిచాడు ఉద్రేకంగా జమీందారుగారు.

ఆయన ముఖం చూస్తే గోపాలానికి భయం వేసింది. నెరసిన కనుబొమల క్రిందనున్న కండ్లలో కోపం ప్రస్ఫుటంగా కనబడుతోంది.

"నేను అమాయకుడిని, అని వాడు చెప్పలేదూ?"

"ఉరితీయబడేముందు అంతా అలానే అంటారు."

"నువ్వు నమ్మలేదా?" సూటిగా చూస్తూ అడిగాడు.

"ఊహు. ఇవన్నీ నమ్ముతూ కూర్చుంటే ఉద్యోగం వదులుకోవాలిందే"

"కాని, వాడు అమాయకుడు. నిజంగా అమాయకుడు" అన్నాడు బాధతో కూడిన కోపంతో జమీందారుగారు.

"మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాలం.

"వాడు నా కొడుకు"

ఛెళ్ళున వీపుమీద ఎవరో కొట్టినట్లయింది గోపాలరావుకి "మీ...కొడుకా" అడిగాడు ఖంగారుగా.

"అవును, నా కొడుకు. నాకు ఈ లోకంలో ఉన్నది వాడొక్కడే. వాడ్ని నాకు కాకుండా చేశావు. పైగా గొప్పగా దాని గురించి చాటుకుంటున్నావు. నువ్వు చేసిన దానికి అనుభవిస్తావు. ఎక్కడో కాదు. ఈ లోకంలోనే. ఇప్పుడే" అంటూ పెద్దగా నవ్వసాగాడు.

గోపాలానికి భయం వేసింది. లేచి నిలబడాడు పారిపోదామని. "నువ్వు ఈ గది విడిచి బయటికి వెళ్ళలేవు. నీ ఆయువు మూడింది. ఆ ద్రాక్షరసంలో మంచివిషం కలిపించాను. నువ్వు జీవించేది ఇంకా అర గంటమాత్రం" అన్నాడు కర్కశంగా నవ్వుతూ.

ఆదిరిపడ్డాడు గోపాలం. కాళ్ళక్రింద భూమి కదిలిపోతున్నట్లు, తలలో అగ్నిపర్వతాలు, అణ్వస్త్రాలు పగులుతున్నట్టు బాధపడ్డాడు. అప్పుడే విషం పనిచేస్తున్నట్టుగా కడుపులో తిప్పటం మొదలెట్టింది. కళ్ళు తిరిగాయి. కుర్చీలో కూలబడ్డాడు.

ముసలాడు వికటాట్టహాసం చేస్తున్నాడు. "నా కొడుకు ఆత్మశాంతిస్తుంది. నాకు తృప్తి కలిగింది. నీమంచి ఇప్పుడు నేను భయపడే దేమీ లేదు. మృత్యుదేవత కబంధ హస్తాలలో నలిగిపోతావు ఇంకాసేపట్లో. నీజీవిత నాటకానికి భరతవాక్యం పలకబోతున్నారు. తెర పడిపోతుంది. నా కొడుకు ఆత్మకిశాంతి కలిగింది"— అరుస్తున్నాడు ముసలాయన.

గోపాలం భయంతో వణికిపోతున్నాడు. అతనికి దుఃఖం ముంచుకొచ్చింది. తను ఆశించినవి, తనకందుబాటులో రాబోతున్నవి

(48- వ పేజీ చూడండి)



# ఇద్దరు హాస్య నటులు

(17 వ పేజీ తరువాయి)

అతనికండ్లముందు తిరిగి కళ్ళమ్మట నీళ్ళు తెప్పించాయి. శూన్య దృక్కులతో చూస్తున్నాడు.

ఇంతలో ఆయనముఖంలో కాఠిన్యత మాయమైంది. క్రమంగా చిరునవ్వు ఆవరించుకుంది. "ఇటుచూడు" భయంకరంగా అరిచాడాయన.

కాడిలిపోతూ తలెత్తి చూశాడు.

ముసలాయన మూతిపున్న మీసాలు, తలకి ఉన్న విగ్గు, గడ్డం తీసేశాడు. గోపాలం తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు. ఎదురుగా నవ్వుతూ రమణమూర్తి కూర్చుని ఉన్నాడు. గోపాలం ఆనందానికి అంతులేదు. గబగబ కళ్ళు తుడుచుకుని.

"ఇండాకనుంచీ నువ్వేనటోయ్ ఇంత హడావుడి చేసింది?" అన్నాడు. ఇంకా అనుమానంపోక.

పెల్లిగానవ్వాడు రమణమూర్తి, గోపాలం వీపుమీద తట్టుతూ "విషంలేదు ఏమీలేదు గాని బెంగపడకు...ఇక పోదాంపద. రాధ నీకోసం ఎదురుచూస్తూంటుంది."

గోపాలం మనసు విషం విషయం తేలటంలో తేలికపడింది. కాని అంతలో విచార రేఖలు ఆవరించుకున్నాయి. తను ఓడిపోయాడు.

ఈ విషయమంతా అన్ని ఊళ్ళవారికీ పోయింది. ఎక్కడచూసినా రమణమూర్తిని గురించి చెప్పుకునేవాళ్ళే.

గోపాలరావు ప్రజలని హాసగిస్తే గోపాలాన్నే హాసగించి ఏడిపించాడు రమణమూర్తి.

సరిగ్గా ఇదిజరిగిన నెలరోజులకి బ్రహ్మాండమయిన పందిట్లో, ట్యూబ్‌లైట్ల కాంతిలో, ప్రముఖులసాన్నిధ్యంలో, గోపాలరావు అధ్వర్యంక్రింద రమణమూర్తి రాధల వివాహం వైభవంగా జరిగింది. గోపాలరావు వధూవరులను మనసారా ఆశీర్వదించాడు. రమణమూర్తి హృదయంలో ఆనందం వెల్లివిరిసింది. రాధ ముఖంమీద చిరునవ్వు తాండవించింది. ★

(లియొనార్డ్ మెర్రిక్ ఆధారంగా)

# పెళ్ళిసంగీతం

(35-వ పేజీ తరువాయి)

హార్మోనియం వాయించటం చాతనయిన వాడు మేష్టరయితే శిష్యురాలి శ్రుతితో ఏ విధమైన సంబంధమూ ప్రమేయమూ లేకుండా తన శ్రుతికే ఆమె గొంతును మేళవింపజేసి పాఠం చెప్తాడు. అది వినేవాళ్ళకి బాధగాని వాళ్ళిద్దరికీమాత్రంకాదు. ఒక వేళ ఆ మేష్టారికి శిష్యురాలి శ్రుతి తెలుసుకోగలిగే శక్తి ఉన్నా, ఆయన చెప్పిన శ్రుతిలో పాడటంచేతకాక సాధక సమయాల్లో ఆమె గాత్రం ఒక త్రోవను హార్మోనియం శబ్దం మరొక త్రోవను పోతూండటం మనకి నిత్యానుభవంలో నిదే! ఇక అలాంటప్పుడు లయజ్ఞానం వారినుంచి ఆశించటం చాలా పొరపాటు. అనేకమైన ఇబ్బందులు పొరుగిళ్ళవారికి, ఆ వీధినే నడవవలసిన వారికి కలుగుతూ ఉంటాయి.

నే నెరిగున్న ఒకాయన తనకి పరమ శత్రువైన పొరుగింటి, ఆసామీ కూతురుకి అచిరకాలంలో అనువైన సంబంధం కుదిరి పెళ్లి కావాలని తహతహ లాడేవాడు. అంతే కాదు. తనంతట తనే ఆ వచ్చిన వారికి పొరుగింటి ఆయన్నిగురించి మంచిగా చెప్పేవాడు. అన్నింటిలోనూ ఆయనకు వ్యతిరేకంగా ఉంటూ ఈ ఒక్కదాంట్లోనూ ఆయనకి అంత అనుకూలంగా ఉండటానికి కారణమేమిటని నేనొకసారి అడిగాను. అప్పుడాయన "వాళ్ళమ్మాయి పెళ్ళికోసం సంగీతం సాధిక చేస్తుంటే వినలేక పోతున్నాం. భగవత్కృపవల్ల ఆ అమ్మాయికి పెళ్ళయితే ఇక మాకు ఆ బాధ ఉండదుగదా-అని..." అన్నాడు. పైకిచెప్పినా చెప్పకపోయినా ఇటువంటి బాధ అందరూ పడేదే!...

సాధన చేసేటప్పుడు ఇలా ఉన్న పాట పెళ్ళివారిముందు పాడవలసిన ఘడియ వచ్చేసరికి మరీ 'ఇది'గా తయారవుతుంది. అప్పుడు పెళ్ళికూతురుని పరీక్ష చేద్దామని వచ్చిన వారికే పరీక్షా సమయం ఆసన్నమవుతుంది. అంతసేపూ నవ్వకుండా నే ఉండగలగటం మాటలు కాదుగా మరి!... నవ్వటం మర్యాద కాదాయె!... అందుచేత పెళ్ళికూతుళ్ళని చూసేందుకు వెళ్ళేవారు ఒక హాస్యగాణ్ణి వెంట పెట్టుకుని వెళ్ళటం మంచిదని నా సలహా! ఇలాంటి ఇబ్బంది వచ్చినప్పుడు వాడు పరిస్థితిని గ్రహించి నలుగురికీ నవ్వు తెప్పించేమాట ఒకటి అంటాడు. ఆవంతని అందరూ చక్కగా నవ్వుకోవచ్చును...తరవాత మీ ఇష్టం!...

## "బ్రోవభారమా"

పాట బాగా పాడేవాళ్ళల్లో కూడా కొన్నికొన్ని చిట్కాలు ప్రయోగించేవాళ్ళు, లేకపోలేదు. ఆ పాడేపాటలోనే ఒక "ఛాలెంజి"యో ఒక 'విన్నపమో' ఏదో ఒకటి ఉండితీరుతుంది. దాని ప్రభావం కూడా పెళ్ళికొడుకుమీద వారి తరఫువారి మీదా ఉండి తీరుతుంది. "బ్రోవభారమా!" అని పాడిందనుకోండి! అంతవరకూ వచ్చిన ఏ పెళ్ళికొడుకైనా "అవును! భారమే! నేను బ్రోవలేను!" అని అనగలడా? అంటే పరువు, ప్రతిష్ఠా దక్కుతాయా? అందుచేత తప్పని సరిగా, ఆ ఛాలెంజిని ఎదుర్కొనేందుకైనా పెళ్ళిచేసుకు తీరుతాడు గదా!..." రామా! నిన్నే నమ్మిన వారము" అనో, "నను పాలింపగ నడచి వచ్చితివా?"అనో పెళ్ళికూతురుపాడిందనుకోండి! కాదని అనగలిగే కర్కశహృదయం ఏ పెళ్ళికొడుక్కి ఉంటుంది?...అందుచేత తనమీద అంతటి నమ్మకాన్ని పెంచుకున్న ఆ కన్యారత్నాన్నితప్ప అన్యులని పెళ్ళాడనని అన్నాడంటే ఆశ్చర్యమేమి ఉంది?... అసలు నిజం చెప్పాలంటే త్యాగరాజస్వామి మొదలయినవారు ఆయా కీర్తనలు వ్రాసేటప్పుడు పెళ్ళికూతుళ్ళ సంగీత పరీక్షలను కూడా దృష్టిలో ఉంచుకునే వ్రాసి ఉండాలి?

అయితే పాట బాగా విన సొంపుగా ఉన్నా, వినటానికి కష్టంగాఉన్నా కూడా తప్పకుండా సగం అయేసరికి ఆపమనటం ఆచారం. అసలు ఇలాంటి సందర్భాల్లో ఉపయోగపడేందుకే పిల్లలతోపాటు పెద్దలు కూడా వెడతారు పెళ్ళిచూపులకి...అంతే గాని ఆకాశవాణివారిలాగ నువ్వు పాడగల ముప్ఫైకీర్తనలు చెప్పు! నువ్వు ఎన్నిరాగాలు ఆలాపించగలవు? అని ఎవరూ అడగరు!... ఈ అవకాశమే గనక లేకపోతే సగానికి పైగా పెళ్ళిళ్ళు కానేకావు...

ఇంకొక విషయంకూడా!...పెళ్లి చూపుల నాడు పాటల పరీక్ష చేసినవారే పెళ్ళయాక ఆ అమ్మాయి గొంతెత్తి పాడటం సహించక పోవచ్చు. అలాంటప్పుడు అంత చిన్న పరీక్ష కోసం పెద్ద కృషిచెయ్యటం అనవసరమే కూడాను. కనకనే ఆ సంగీతం అంతంతగానే ఉంటుంది...అందుచేతే దానికి "పెళ్ళి సంగీతం" అని ప్రత్యేకమైన పేరు వచ్చింది.

ఇవన్నీ మన కందరికీ తెలుసును. అయినా కాని ఈ 'సంగీతం' ఎవరూ వదలరు. ఇది సంగీత శాఖల్లోకల్లా బహుళ ప్రచారాన్ని పొందినది. కాల పరిణామాన్నిబట్టి ముందు ముందు ఆడపిల్ల మగపిల్లవాడిని పరీక్షచేసే రోజు కూడా రావచ్చు—(ఆ సూచనలు అప్పుడే కనిపిస్తున్నాయి). అలాంటప్పుడు, భావితరాల పెళ్ళికొడుకులు కూడా 'పెళ్ళి సంగీతం' సాధన చెయ్యవలసిన అవసరం కలుగవచ్చు. కాబట్టి వారంతా జాగ్రత్తగా ఉండి ఇప్పటినుంచీ కృషిచెయ్యటం అవసరమేమో ఆలోచించండి!... ★